ఆంధ్రజ్యోతి

# మేలురకం పళ్లను పండించాలి

## రైతులకు గద్వాల ఎమ్మెల్యే డికె అరుణ సూచన



జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరుణ

గద్వాల, మార్చి 5 (ఆన్‌లైన్) : గద్వాల ప్రాంతంలో పండించే పండ్లను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయిలో మేలురకమైన పండ్లను పండించాలని,అందుకు శాస్త్రవేత్తలు, పండ్లతోటల పెంపకం దారులు కృషి చేయాలని గద్వాల ఎమ్మెల్యే డికె అరుణ కోరారు. ఆదివారం నాడిక్కడి ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన రాష్ట్ర దానిమ్మ ఉత్పత్తి దారుల సమాఖ్య ఏర్పాటు చేసిన రైతుల అవగాహన సదస్సు కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో అరుణ మాట్లాడుతూ గద్వాల ప్రాంతంలో ఇటీవల మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న దానిమ్మ పంటను కూడా రైతులు ఎక్కువగా పండించడం సంతోషదాయకమన్నారు. జిల్లాలోనే గద్వాల పండ్ల తోటల పెంపకంలో గణనీయమైన ప్రగతిని సాధించిందని, ఇంకా సాధించాలని ఆమె రైతులను కోరారు. నీటి వాడకం ఎక్కువగా ఉండే వరి లాంటి పంటలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. పండ్ల తోటల వల్ల గద్వాల ప్రాంతానికి ఇప్పటికే ఎంతో పేరుతెచ్చినందుకు రైతులకు కృతజ్ఞతలు తెలియజేశారు. గద్వాల ప్రాంతంలో 1.60 లక్షల ఎకరాలకు నెట్టెంపాడు నీరు మూడు సంవత్సరాలలో వస్తుందని, అప్పుడు ఇంకా పండ్లతోటలను ఎక్కువ గా పెంచే అవకాశం ఏర్పడుతుందన్నారు. కొన్ని రకాల పంటల విషయంలో మహారాష్ట్ర ముందున్నదని, రాష్ట్రాన్ని కూడా ఆ స్థాయికి తీసుకెళ్లాలని ఆమె కోరారు. ఈ ప్రాంతంలో పండించే పండ్లను విదేశాలకు ఎగుమతి చేసేందుకు రవాణా పరంగా శంషాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న అంతర్జాతీయ విమానాశ్రమం కూడా సహాయపడుతున్నదన్నారు. హైదరాబాద్ ప్రాంతంలోనే ద్రాక్షపండ్లు పండుతాయనే భావన ప్రజలలో ఉండేదని, మల్దకల్ మండలం శేషంపల్లి గ్రామ రైతులు ద్రాక్షపండ్లను పండించి తామెవరికి తీసిపోమనే విషయాన్ని రుజువు చేశారని ఆమె అన్నారు. గద్వాల ప్రాంతంలో మూడు వేల ఎకరాలలో పండ్ల తోటలు ఉన్నాయని, వాటిని 30 వేల ఎకరాలకు విస్తరించాలని అరుణ కోరారు. రైతు అవగాహనసదస్సుకు మహారాష్ట్ర నుంచి వచ్చిన శాస్త్రవేత్తల కోసం ఆమె కొద్దిసేపు హిందీ, ఇంగ్లీష్‌లో ప్రసంగించారు. హార్టికల్చర్ కార్యాలయ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని ఇప్పించగలనని అరుణ సదస్సు ముఖంగా హామీ ఇచ్చారు. ఈ అవగాహన సదస్సుకు అఖిల భారత దానిమ్మ ఉత్పత్తి దారుల సమాఖ్య అధ్యక్షులు ప్రభాకర్ చాందిని(పూణె), మహాఅన్నార్ టెక్నికల్ డైరెక్టర్ కులకర్ణి(షోలాపూర్), జాతీయ దానిమ్మ పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ పి.కుమార్(షోలాపూర్), ప్లాంట్ పాథాలజిస్టు కెకె శర్మ(సోలాపూర్), ప్రోమోగ్రనేట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ పి.సుధాకర్‌రావు, ఆంధ్రాబ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వై.అమర్‌నాథ్(కర్నూలు), ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ ఎంఎం బాష, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ జగదీశ్వర్‌రెడ్డి, గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ నందిన్నె ప్రకాష్‌రావు, గద్వాల ఎంపిపి ఏకాంబరరెడ్డి, రాష్ట్ర దానిమ్మ ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు బాణాలబద్రినాధ్, పండ్లతోటల రైతులు జెసి రంగారెడ్డి, పద్మారెడ్డిలు పాల్గొన్నారు.



రైతులు




సదస్సులో రైతులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే